క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశాలు

దమ్మపేట: మండల కేంద్రంలోని స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామని ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్ తెలిపారు. బుధవారం ప్రిన్సిపాల్ విలేఖర్లతో మాట్లాడుతూ.. నేటి నుంచి ఫిబ్రవరి 17వ తేదీ వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు స్వీకరించి, మార్చి 12వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

సెక్టార్ సమావేశం

అన్నపురెడ్డిపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని సీడీపీఓ నిర్మలాజ్యోతి ఆదేశించారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సెక్టార్ సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం ఇటీవల జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న సీడీపీఓను అంగన్‌వాడీ సిబ్బంది శాలువ కప్పి సన్మానించారు. సూపర్‌వైజర్ గంగాజలం, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

అభినందనీయం..

అశ్వాపురం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరుపేద విద్యార్థులకు నేను సైతం సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మధ్యాహ్న భోజనం అందించడం అభినందనీయమని తహసీల్దార్ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం కళాశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. గత 33 రోజులుగా భోజనం అందిస్తున్న ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, అధ్యాపకుడు ప్రసాద్‌ను అభినందించారు. అనంతరం కళాశాలలో ప్రిన్సిపల్ సత్యప్రకాష్ అధ్యక్షతన తహసీల్దార్ సురేష్‌కుమార్‌ను అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించారు.

విద్యార్థులు పోరాడాలి

మణుగూరురూరల్: ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడానికి విద్యార్థులందరూ ఐక్యంగా పోరాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం పిలుపునిచ్చారు. మణుగూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మూడో మహసభలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరపు బడ్జెట్‌లో అయినా దేశ జీడీపీలో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా హరీష్, అధ్యక్షుడిగా సాగర్, ఉపాధ్యక్షులుగా అఖిల్‌తేజ్, సాగర్, సంపత్‌లతో పాటు 19మందిలో కార్యవర్గాన్ని, ఏడుగురితో కార్యదర్శివర్గాన్ని ఎన్నుకున్నారు. రాములు, వెంకన్న పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

దమ్మపేట: యాదవ సంఘం మండల కమిటీని జిల్లా నాయకుల సమక్షంలో బుధవారం మొద్దులగూడెం గ్రామంలోని ఏకుల పోతమ్మ దేవాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జోనెబోయిన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నూనె నాగశ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా చక్కిరాల మల్లేశ్వరరావు, మానికల సుబ్బారావుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు పరమేష్, వల్లెపు యాకయ్య, దొడ్డాకుల రాజేశ్వరరావు, యర్రగొర్ల రాధాకృష్ణ, దొడ్డాకుల గోపాలరావు, మారగాని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారం గ్రామానికి చెందిన నిరుపేద అంధుడు పిండి వీరయ్యకు సర్పంచ్ సున్నం రాంబాబు సిఫారసు మేరకు గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ వారు మరుగుదొడ్డి నిర్మాణానికి సహకరించారు. ఆ మేరకు ఖర్చులకు నిర్మాణం ప్రారంభంలో రూ.10 వేలు, బుధవారం రూ.15,500 వీరయ్యకు అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు కె.సోమయ్య, నాగేష్, స్థానికులు పాల్గొన్నారు.

పదోన్నతులు చేపట్టాలి

మణుగూరురూరల్: గిరిజన సంక్షేమశాఖలోని ఉపాధ్యాయులకు కూడా పదోన్నతులు, బదిలీలను వెంటనే చేపట్టాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు షేక్ మీరాహుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయన మాట్లాడారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి కారం సీతారామయ్య, ఉపాధ్యక్షుడు బి.వెంకన్న, టి.విజయలక్ష్మి, కార్యదర్శులు ఎస్.రాంబాబు, జయమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఏఎస్పీకి స్వాగతం

భద్రాచలం: భద్రాచలం నూతన ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పరితోష్ పంకజ్‌ను బీఆర్ఎస్ మండల నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. కలిసిన వారిలో మండల అధ్యక్ష, కార్యదర్శులు అరికెల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, నాయకులు రత్నం రమాకాంత్, చింతాడి చిట్టిబాబు, ఎండి.నవాబ్, బంబోతుల రాజీవ్, బల్లా రాంబాబు, విజయ్, నాగేందర్ తదితరులు ఉన్నారు.

టోర్నమెంట్ ప్రారంభం

మణుగూరురూరల్: మండలంలోని ఏరియా స్టోర్స్ గ్రౌండ్‌లో టీడీఏ మాస్టర్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకుని బ్యాటింగ్ చేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

భారంగా మారిన సాగు

- పెరిగిన ఎరువుల ధరలు
- తగ్గిన రాయితీలు
- ప్రభావం చూపుతున్న ఇంధన ధరల పెంపు
- అమాంతం పెరిగిన పెట్టుబడి ఖర్చు



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు (ఫైల్)

బూర్గంపాడు: పంటల సాగు రైతులకు మరింత భారం మారింది. రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. వీటికి తోడు ఈ ఏడాది ఎరువులు, పురుగు మందుల ధరలు కూడా బాగా పెరిగాయి. దీని వల్ల రైతుపై పెట్టుబడి భారం పెరిగిపోయింది.

డీజిల్ ధరల ప్రభావం..

పెట్రో, డీజిల్ ధరల పెంపు ప్రత్యక్షంగా, పరోక్షంగా పంటల సాగుపై ప్రభావం చూపుతుంది. సాగులో ట్రాక్టర్లు కీలకంగా పనిచేస్తాయి. దుక్కులు దున్నటం, దమ్ములు చేయటం, పురుగు మందుల పిచికారీ, ఎరువులు, కూలీల తరలింపు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రైతులు పూర్తిస్థాయిలో ట్రాక్టర్లపైనే ఆధారపడుతున్నారు. డీజిల్ ధరల పెంపు కారణంగా ట్రాక్టర్ల కిరాయిలు పెరిగాయి. దీంతో పరోక్షంగా రైతులపై పెట్టుబడి భారం పెరిగినట్టైంది.

గుదిబండగా ఎరువుల రేట్లు

మరోవైపు ఎరువుల తయారీకి వినియోగించే ముడి సరుకు ధరలు పెరిగిన కారణంగా ఎరువుల కంపెనీలు ధరలను అమాంతం పెంచాయి. గతంలో ఉన్న 50 కిలోల బస్తాల ఎరువుల ధరను రూ.250 నుంచి రూ.500 వరకు పెంచారు. గతంలో కాంప్లెక్స్ ఎరువులపై కేంద్రప్రభుత్వం ఎక్కువ రాయితీలు ఇచ్చేది. రానురానూ కాంప్లెక్స్ ఎరువులపై రాయితీలను తగ్గిస్తుండటంతో ధరలు పెరుగుతూవచ్చాయి. ఇప్పుడు ఎరువుల ధరలను ఒకేసారి 20శాతం వరకు పెంచటంతో రైతులు దిగులు చెందుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా వానాకాలం, యాసంగి పంటల సాగుకు రైతులు సుమారు 1.87లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగిస్తున్నారు. ఇందులో కాంప్లెక్స్ ఎరువులు, డీఏపీ, యూరియా, పొటాష్ తదితర ఎరువులున్నాయి. ప్రస్తుతం 50 కిలోల డీఏపీ ధర రూ.1400కు చేరింది. 20-20-0-13 ఎరువు ధర రూ.1400కు చేరగా.. 14-35-14 రూ.1500కు, 28-28-0 రూ.1750కు, 10-26-26 రూ.1500కు చేరింది. ఎరువుల ధరలు రైతులకు గుదిబండగా మారాయని ఈ లెక్కలు తేటతెల్లం చేస్తున్నాయి. ఇక పురుగుమందుల ధరలూ ఈ ఏడాది రెట్టింపయ్యాయి. పంటల సాగులో ఎరువుల కంటె పురుగుమందులకే ఎక్కువ పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది.

ప్రత్యామ్నాయాలపై ఆధారం..

ప్రస్తుతమున్న ఎరువుల ధరలు సన్న, చిన్నకారు రైతులకు భారంగా ఉండటంతో వారు తక్కువగా ఎరువులు వినియోగిస్తున్నారు. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఎక్కువగా ఉండటంతో రైతులు యూరియాను ఎక్కువగా వినియోగిస్తున్నారు. రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించని పాలకులు ఎరువుల ధరల నియంత్రణలో మాత్రం కంపెనీలకు కొమ్ముకాస్తున్నాయని రైతు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

పెట్టుబడులు పెరిగిపోయాయి



ఇప్పటికే పంటల సాగుకు పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయి. డీజిల్ ధరలు పెరగటంతో ట్రాక్టర్ల కిరాయిలు పెరిగాయి. గతంలో కంటె ఇప్పుడు ఎకరం సాగు చేసేందుకు సుమారు రూ.5 వేల వరకు పెట్టుబడి పెరిగింది. దీనికి తోడు ఎరువులు, పురుగుమందుల ధరలు కూడా పెరగటంతో పంటలు వేయలేకపోతున్నాం.

– మంచాల వెంకటేశ్వరరెడ్డి, రైతు, రెడ్డిపాలెం

ఎరువులు కొనే పరిస్థితులు లేవు



ఇప్పుడు ఎరువులు ధరలు 50 కిలోల బస్తా రూ.1400 నుంచి రూ.1800 వరకు ఉంది. ఎరువులకే ఎకరాకు రూ.10 వేల పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. పురుగు మందుల ధరలు రెట్టింపయ్యాయి. పంటల దిగుబడులు, మార్కెటింగ్ చూసుకుంటే పెట్టుబడులు కూడా తిరిగి రానటువంటి పరిస్థితులు ఉన్నాయి.

– పేరం రామాంజిరెడ్డి, రైతు, లక్ష్మీపురం

మైనార్టీల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అశ్వాపురం మండల ముస్లిం మైనార్టీ నాయకులు, మతపెద్దలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ.. పేద ముస్లిం మైనార్టీ యువతుల వివాహానికి షాదీముబారక్ ద్వారా లక్షా 116 రూపాయలను అందజేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వీరికోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేసి మెరుగైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు



అశ్వారావుపేట తహసీల్దార్ లూథర్ విల్సన్..



ములకలపల్లి తహసీల్దార్ శేషగిరిరావు..

అశ్వారావుపేటరూరల్: జూలూరుపాడు నుంచి బదిలీపై వచ్చిన జి.లూథర్ విల్సన్ అశ్వారావుపేట తహసీల్దార్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2017లో ఈయన ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేశారు. విధుల్లో చేరిన తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది, పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కలిశారు.

ములకలపల్లి తహసీల్దార్‌గా శేషగిరిరావు

ములకలపల్లి: ములకలపల్లి మండల తహసీల్దార్‌గా శేషగిరిరావు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శేషగిరిరావు ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ములకలపల్లికి వచ్చారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని విప్పలసింగారం, రైల్వే గేట్ కూనవరం గ్రామాల క్రీడాకారులకు ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం వాలీబాల్ కిట్లను తన క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో విప్పలసింగారం ఉపసర్పంచ్ గోరంట్ల కనకయ్య, శ్రీరాముల రాము, శ్రీరాముల లక్ష్మణ్, కారం సూరయ్య, కటుకూరి శ్రీనివాసరావు, తమ్మిశెట్టి సాంబ, ప్రకాష్, శ్రీను, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పినపాక: మండల పరిధిలోని 23 గ్రామపంచాయతీల యువకులకు రేగా విష్ణు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లను స్థానిక ప్రజాప్రతినిధులు మంగళవారం పంపిణీ చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో త్వరలో క్రీడా పోటీలు నిర్వహిస్తామని మండల పార్టీ అధ్యక్షుడు సతీష్ రెడ్డి తెలిపారు. ఎంపీపీ గుమ్మడి గాంధీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్లు అందజేయాలి



భద్రాచలంఅర్బన్: ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న బ్రహ్మచారి

ములకలపల్లి: భవన నిర్మాణ కార్మికులకు మోటారు సైకిళ్లు ఇవ్వాలని తెలంగాణా బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) మండల కార్యదర్శి ఓరుగంటి శ్రీను, అధ్యక్షుడు సూరం పుల్లారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్ శేషగిరిరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మస్తాన్, కోంద్రు నాగరాజు, సంగం శ్రీను, కొంగల శ్రీను, కొడిమె నర్సింహారావు, జుంజునూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించిన మోటార్ సైకిళ్లను పంపిణీ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ కోరారు. దీనిపై బుధవారం స్థానిక తహసీల్దార్ లూథర్ విల్సన్‌కు వినతి పత్రాన్ని అందించారు.కార్యక్రమంలో వెంకన్నబాబు, నారాయణ, శ్రీను పాల్గొన్నారు

భద్రాచలంఅర్బన్: భవన నిర్మాణ కార్మికులందరికీ మోటార్ సైకిళ్ల పంపిణీ చేస్తామని 2022 శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన హామీని వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు భద్రాచలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్ఐ బుద్ధ నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు అప్పారి రాము, నాయకులు ఎస్‌కె.జాకీర్, చాట్ల శ్రీను, అనుగోజు శ్రీను, శివకుమార్, చిన్నరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

కూలిన షెడ్డు..

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని అంబేడ్కర్ సెంటర్‌లోని ఓ దుకాణం ఎదుట ఏర్పాటు చేసిన రేకులషెడ్డు బుధవారం సాయంత్రం ఒక్కసారిగా కూలిపోయింది. ఈ షెడ్డు కింద ఏర్పాటు చేసిన టీకొట్టు, బజ్జీల కొట్టు, పాన్‌షాపు వద్ద ప్రతి రోజూ జనం ఎక్కువగానే ఉంటారు. బుధవారం బజ్జీల కొట్టు మూసివేడం, ఇతర షాపుల వద్ద కూడా ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

నేడు విద్యుత్ కోత

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని వినాయకపురం, నారాయణపురం, గంగారం, నారంవారిగూడెం, దమ్మపేట మండలంలోని మల్కారం, అంకంపాలెం సబ్ స్టేషన్ల పరిధిలోని అన్నీ గ్రామాల్లో గురువారం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ఏడీఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

సమస్యపై తక్షణ స్పందన

అశ్వాపురం: మండల కేంద్రంలో గౌతమీనగర్ కాలనీ గేటు ఎదుట ముస్లిం కాలనీకి వెళ్లే రహదారిపైకి డ్రైయినేజీలోని మురికినీరు వస్తోందని గ్రామస్తులు సామాజిక మాధ్యమాల బహిర్గతం చేయగా.. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి కృష్ణచైతన్య స్పందించారు. రహదారి వెంబడి చెత్తా, చెదారం శుభ్రం చేయించారు. డ్రైయినేజీ పనులు త్వరలోనే చేపడుతామని గ్రామస్తులకు తెలియజేశారు.

వాయిస్ ఫర్ గర్ల్స్..

దుమ్ముగూడెం: గిరిజన బాలికల్లో చైతన్యం తీసుకురావడమే వాయిస్ ఫర్ గర్ల్స్ ముఖ్య ఉద్దేశ్యం అని రామచంద్రునిపేట ఆశ్రమ పాఠశాల హెచ్‌యం వీరమ్మ అన్నారు. ఈ పాఠశాలలో మూడు ఆశ్రమ పాఠశాలలకు చెందిన 160 మంది విద్యార్థినులకు వాయిస్ ఫర్ గర్ల్స్ శిబిరం నిర్వహిస్తుండగా.. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వాయిస్ ఫర్ గర్ల్స్ ఎఫ్‌సీలు సుప్రజ, వేణిశ్రీ, పాఠశాల ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

భద్రాచలంఅర్బన్: భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో అధిక నిధులు కేటాయించాలని ఏఐటీయూసీ భద్రాచలం పట్టణ కార్యదర్శి బి.సాయికుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో బత్తుల నర్సింహులు అధ్యక్షతన భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) పట్టణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు మారెడ్డి శివాజీ, ఎస్వీబీఎస్ నాయుడు, బత్తుల రామారావు, గురవయ్య, వెంకన్న, రామకష్ణ, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

భద్రాచలంఅర్బన్: ఔరంగాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో స్థానిక సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులు మహమ్మద్ అబ్బాస్, గాలి రామ్మోహన్ రావు బంగారు పతకాలు సాధించారు. ఈ క్రీడాకారులతోపాటు కోచ్ రామిరెడ్డిని ఏఎస్పీ పరితోష్ పంకజ్‌తోపాటు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.మల్లేశ్, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.వసంతరావు, ట్రెజరర్ వీరారెడ్డి అభినందించారు.

సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి



బాధ్యతలు చేపట్టిన అనంతరం ఏరియా అధికారులతో మాట్లాడుతున్న జీఎం

మణుగూరుటౌన్: సమష్టి కృషితో సంస్థ పురోగాభివృద్ధికి పాటుపడాలని మణుగూరు ఏరియా నూతన జీఎంగా బాధ్యతలు చేపట్టిన దుర్గం రాంచందర్ అన్నారు. బుధవారం మణుగూరు ఏరియా జీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. ఏరియా అధికారులతో మాట్లాడారు. అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల సహకారంతో ఇప్పటి వరకు బొగ్గు ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తున్న మణుగూరు ఏరియా ఆనవాయితీని ముందుకు కొనసాగిద్దామన్నారు. కార్మిక సంక్షేమానికి, సౌకర్యాలకు తగు ప్రాధాన్యత ఇస్తామన్నారు. బాధ్యతలు చేపట్టిన జీఎంకు అధికారులు ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్, ఏజీఎం జి.నాగేశ్వరరావు, ఏజీఎం సివిల్ డి.వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, ఎస్ఓఎం వెంకటరమణ, పీఓలు లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసచారి, డీజీఎం ఐఈడీ వెంకట్‌రావు, డీజీఎం కేపీహెచ్ పి.సురేష్, డీజీఎం పర్చేజ్ శ్రీనివాసమూర్తి తదితర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

మేడారానికి ఆర్టీసీ సర్వీసులు

మణుగూరురూరల్: టీఎస్ఆర్టీసీ మణుగూరు నుంచి మేడారానికి ప్రత్యేక బస్ సర్వీసులను గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ స్వామి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ బస్సులు ప్రతీ రోజూ ఉదయం 8 గంటలకు బయలుదేరి.. మేడారంలో భక్తులు మొక్కులు చెల్లించుకున్న తరువాత తిరిగి తీసుకువస్తుందని తెలిపారు. మణుగూరు డిపో పరిధిలోని అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7382856660, 7382857393 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

విమర్శిస్తే ఊరుకోం..

గుండాల: ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టు పార్టీని విమర్శిస్తే సహించేది లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రేసు ఎల్లయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆళ్లపల్లి ఎంపీపీ కొంద్రు మంజు భార్గవికి సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాను విమర్శించే అర్హత లేదన్నారు. సీపీఐ జోలీకి రావద్దని హితవు పలికారు.

డైరెక్టర్‌కు ఘన సన్మానం



వెంకటేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఏరియా జీఎంగా విధులు నిర్వర్తించి డైరెక్టర్ (పీఅండ్‌పీ)గా పదోన్నతితో వెళ్తున్న వెంకటేశ్వరరెడ్డిని హెచ్ఎంఎస్ నాయకులు బుధవారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షురాలు కొడిపల్లి శ్రీలత, బ్రాంచ్ నాయకులు అజార్ ఖాన్, సతీష్, కనకయ్య, కుమారస్వామి, విజయ్‌కుమార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు రద్దు చేయాలి

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ వినియోగదారులపై మోపిన ఏసీడీ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు పిట్టల అర్జున్, చిరంజీవి, గంగరాజు, మడిపల్లి వెంకటేశ్వరరావు, జగన్నాథం, అప్పారావు కె.భద్రం పాల్గొన్నారు.

చంద్రుగొండ: ఏసీడీ పేరిట అదనంగా బిల్లుల్లో వేసిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండలశాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు ఎస్‌కె.ఉమర్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో ఏఈ నర్సింహారావుకు మెమోరాండం అందించారు. ఆందోళనలో నాయకులు వరికూటి వెంకట్రావ్, తోలెం వెంకటేశ్వర్లు, బాలు, భీముడు, నవీన్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

చంద్రుగొండ: కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం ఎంపీపీ బాణోత్ పార్వతి మండల పరిషత్ కార్యాలయంలో 19 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు దారా వెంకటేశ్వరరావు, లంకా విజయలక్ష్మి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎస్డీ రసూల్, సర్పంచ్‌లు రణ్యా, కుమారి, టీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అల్పాహారం అందజేత

దమ్మపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతులకు హాజరైన పదో తరగతి విద్యార్థులకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చేతుల మీదుగా అల్పాహారం అందజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు దారా యుగంధర్, సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎంఈఓ కీసర లక్ష్మి, హెచ్ఎం.మస్తాన్‌వలీ, నాయకులు అబ్దుల్‌జిన్నా, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

భద్రాచలంఅర్బన్: ఒక హృదయం సోషల్ వెల్ఫేర్ వారు రూపొందించిన కేన్సర్ నిర్మూలన వాల్ పోస్టర్లను భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ బుధవారం ఆవిష్కరించారు. సంస్థ చేపడుతున్న కార్యక్రమాన్ని అభినందించారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు సంజీవ రెడ్డి మాట్లాడుతూ.. వాల్ పోస్టర్లతో కేన్సర్‌పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ పొన్నాల కవిత, సంస్థ కార్యవర్గ సభ్యులు కడాలి నాగరాజు, కుమ్మరపల్లి నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించొద్దు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వం రజక వృత్తిదారులకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తుంటే విద్యుత్ శాఖ అధికారులు బిల్లుల కోసం వేధిస్తున్నారని, బిల్లులను చెల్లించవద్దని జిల్లా రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిగొండ రాంబాబు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేసి, ట్రాన్స్‌కో ఏఈఈకు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో శ్రీను, కృష్ణ, నారాయణ, అప్పన్న, నాగేశ్వరరావు, బుచ్చిబాబు, వరలక్ష్మి, రావులమ్మ, అప్పయమ్మ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను నిబంధనల ప్రకారం అర్హులైన వారికి పంపిణీ చేయాలని భద్రాద్రి యువజన ఫోరం గౌరవ అధ్యక్షుడు గడ్డం రాము బుధవారం ఓ ప్రకటనలో కోరారు. లాటరీ పద్ధతిలోనే ఇళ్ల కేటాయించాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ స్థానిక తహసీల్దార్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

వైద్య సౌకర్యాలు పెంచాలి

దమ్మపేట: దమ్మపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సౌకర్యాలను పెంచాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు తాటిసుబ్బన్నగూడెంలోని ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఈసీజీ, ఎక్స్‌రే సౌకర్యాలు కల్పించి, కనీసం ఇద్దరు వైద్యులను నియమించాలని కోరారు. ధర్మ, బత్తుల సాయి, బెజవాడ రాంబాబు, కృష్ణవేణి, నాగమణి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

నిలువెత్తు నిదర్శనం..!



హరితహారంలో భాగంగా భద్రాచలం పట్టణంలోని గోదావరి ఒడ్డున శ్మశాన వాటిక పక్కన భారీగా వివిధ రకాల మొక్కలు నాటారు. లక్షలు వెచ్చించి నాటిన ఆ మొక్కల సంరక్షణను సంబంధిత అధికారులు మరిచారు. మొక్కలు నాటిన ప్రదేశం చుట్టూ సిమెంట్ పోల్స్‌తో రక్షణ కల్పించినప్పటికీ మొక్కలకు నీరు అందించడంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో మొక్కలు పూర్తి స్థాయిలో ఎండిపోతున్నాయి. చెంతనే గోదావరి ప్రవహిస్తున్నా.. మొక్కలు ఎండిపోతుండడంతో స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మొక్కల సంరక్షణ చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– భద్రాచలంటౌన్

ప్రశ్నించాల్సిన అధికారి: వెంకటేశ్వర్లు, పంచాయతీ ఈఓ
ఫోన్ నంబర్: 95050 13090